క్లుప్తంగా

వృద్ధులకు నిత్యావసర వస్తువులు పంపిణీ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదలను ఆదుకోవడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అభినందనీయమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. జూనియర్ చాంబర్స్ ఇంటర్నేషనల్ (జేసీఐ) విజయవాడ ఇంపాక్ట్ శాఖ ఆధ్వర్యంలో న్యూఆర్ఆర్‌పేటలోని అరుణ మహిళా మండలి వృద్ధాశ్రమానికి రూ.15 వేలు విలువైన నిత్యావసర వస్తువుల కిట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నిరుపేద ప్రజలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని, ప్రతి ఒక్కరూ లేనివారికి సహాయం చేయడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం రోడ్డు వెంబడి జీవిస్తున్న వారికి ఆహారపొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఐ స్థానిక శాఖ అధ్యక్షురాలు బి. స్వాతి, డాక్టర్ కలపాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి గాజులతో అర్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో శ్రావణ మంగళవారం పురస్కరించుకుని గాజులతో పూజ జరిగింది. అలివేలు మంగ, పద్మావతికి గాజులతో అలంకారం చేసి విశేషంగా పూజలు అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీలలితా సహస్రనామ పారాయణం, సామూహిక హారతి కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను మందిర ధర్మకర్త అద్దంకి సత్యనారాయణ ప్రసాద్, ఉప్పులూరి శేషప్రసాద్ శర్మ పర్యవేక్షించారు.

పేదలకు అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ప్రజలు, అభాగ్యుల అవసరాలు తీరుస్తూ క్లే లలిత ట్రస్ట్ వారికి అన్నివిధాలుగా అండగా నిలుస్తోందని ఆ ట్రస్ట్ నిర్వాహకులు క్లే నాగేశ్వరరావు, క్లే సీతా మహాలక్ష్మి అన్నారు. క్లే లలిత ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద మంగళవారం అన్నదానం, పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి నెలా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని, నిరుపేదలకు, అభాగ్యులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో తమవంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి నెల 12వ తేదీన పేదలకు అన్నసమారాధన, తోపుడు బండ్లు, ట్రై సైకిళ్ల పంపిణీ, నిరుపేదలకు వస్త్రదానం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ్మడి చంటి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా కల్వర్టు పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే భానునగర్ జంక్షన్‌లో కల్వర్టు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల ఇక్కడ మురుగుకాలువపై కల్వర్టు పాడవ్వటంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించారు. మురుగుకాలువలోని చెత్తచెదారాన్ని తొలగించి కల్వర్టు పనులు చేస్తున్నారు.

కూతురు కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజీలో మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ కోర్సు చేస్తున్న తన కూతురు కనిపించడంలేదని ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, గోపినాథపట్నంకు చెందిన గంటా జయ మంగళవారం నున్న పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గంటా జయ కుమార్తె లావణ్య గుణదలలోని బీసీ హాస్టల్ లో ఉంటూ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజీలో మల్టీపర్పస్‌హెల్త్ వర్కర్ మొదటి సంవత్సరం చదువుతోంది. లావణ్య హాస్టల్‌లో ఉండకుండా పాయకాపురం, రాధానగర్లోని ఆమె స్నేహితురాలు చింతల సాయిప్రియ ఇంట్లో ఉంటుందని ఈ నెల 10వ తేదీన సాయిప్రియ జయకు ఫోనులో చెప్పింది. 11వ తేదీన హాస్టల్‌కి వెళ్లిన జయ విచారించగా లావణ్య అక్కడలేదు. దీంతో తన కూతురు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- జవాబుదారీతనానికి సరికొత్త నిర్వచనం సీఎం జగన్ పాలన
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హతే ప్రామాణికంగా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. జవాబుదారీతనానికి సరికొత్త నిర్వచనంగా జగనన్న పాలన సాగుతుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మంగళవారం 29వ డివిజన్ 207వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ఆయన పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించారు.

నూతన రేషన్ కార్డుల పంపిణీ..

అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డుల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన పలువురికి పర్యటనలో భాగంగా ఆయన కార్డులను అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సెంట్రల్ నియోజకవర్గంలో 1,146 మంది అర్హులను గుర్తించి.. నూతన కార్డులు మంజూరు చేసినట్లు మల్లాది విష్ణు చెప్పారు.



లబ్ధిదారులకు సంక్షేమ కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఈనెల 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

జగనన్న సురక్ష తరహాలో ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మల్లాది విష్ణు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించడం, అవసరమైన వారికి ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించడం, పెద్దాస్పత్రులకు సిఫార్సు చేయడం లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 15 నుంచి వలంటీర్లు తమ పరిధిలోని అన్ని కుటుంబాలకు వెళ్లి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి ఏఎన్ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్లకు సమాచారం ఇస్తారని చెప్పారు.

కుంభకోణాలకు మరో పేరు చంద్రబాబు

కుంభకోణాలకు మరోపేరు చంద్రబాబు అని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా అవినీతిమయమని.. 2014లో సీఎం పదవి చేపట్టాక విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు తెరలేపారన్నారు. తనను ఎవరూ ఏమీచేయలేరని చెప్పుకుంటూ వచ్చిన బాబు.. చివరకు పక్కా ఆధారాలతో దొరికిపోయారన్నారు. డీఈ రామకృష్ణ, సీడీఓ జగదీశ్వరి, నాయకులు బందెల దయానందం, అక్బర్, గోవింద్, హరిబాబు, సురేష్, దేవినేని సుధాకర్, పూర్ణిమ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వనాథుని రచనలు అమృత తుల్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచనలు అమృత తుల్యం అని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. వరుసగా సెలవులు, బంద్ రావడంతో తొమ్మిదో తేదీన జరుపుకోవాల్సిన విశ్వనాథ జయంతి వేడుకలను ఇప్పుడు నిర్వహించుకుంటున్నామని తెలిపారు. విశ్వనాథ సత్యనారాయణ పనిచేసిన కళాశాలలో పనిచేయడం, చదువుకోవడం పూర్వజన్మ సుకృతం అన్నారు. అంత గొప్ప వ్యక్తి పని చేసిన చోట చదువుకుంటున్న విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకుని వారి వారి రంగాల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.



విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తదితరులు

అనంతరం తెలుగు అధ్యాపకులు, నామా శ్రీకాంత్, డాక్టర్ కేవీ శాంతకుమారి మాట్లాడుతూ విశ్వనాథ రచనల గురించి వివరించారు. రాజనీతి పాలనావిభాగాధిపతి డాక్టర్ వీఎస్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు

నగర పరిశుభ్రతకు సహకరించాలి

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నగర వాసులు, వ్యాపారులు వీఎంసీ సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి వి.విజయ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. మొబైల్ కోర్టు సర్కిల్–2 కార్యాలయంలో మంగళవారం పలు కేసులను విచారించారు. ప్రధానంగా రోడ్లపై చెత్తవేసే వాళ్లు, మురుగు ప్రవాహానికి అవరోధంగా డ్రెయినేజీలో వ్యర్థాలు వేసేవారు, రోడ్లపైకి పెంపుడు జంతువులను వదిలేవారు, లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించేవారిపై నమోదైన 18 కేసులను విచారించారు. ఆయా కేసుల్లో నిందితుల నుంచి జరిమానాగా రూ.4,300 విధించారు. జరిమానా విధించిన వారంతా మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్–2, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మొబైల్ కోర్టులో కేసు విచారిస్తున్న న్యాయమూర్తి విజయ్‌కుమార్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రభ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఒక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు మల్లాది విష్ణు తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపకు గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా ఇప్పటికే నియోజకవర్గంలో వేలాది సమస్యలకు పరిష్కారం చూపామని, అయితే ఆ సమయంలో అందుబాటులో లేని ప్రజలు ఈ హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లతో పాటు ఇంటి పన్ను, వాటర్ పన్ను, యూజీడీ పన్నులలో పొరపాట్లు, చదువు పూర్తయి కాలేజీలలో సర్టిఫికెట్లు ఆగిపోయిన విద్యార్థులు, ఆరోగ్య ఆసరా డబ్బులు పడని వారు ఇతర సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందించవచ్చని పేర్కొన్నారు. గతంలో పరిష్కారం కాని వినతులను సైతం మరోసారి పునఃపరిశీలిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం హెల్ప్ డెస్క్ నంబర్ 7627848484ని సంప్రదించాలని తెలిపారు.

'గడప గడప'తో సమస్యల పరిష్కారం

పాయకాపురం(విజయవాడరూరల్): బర్మా కాలనీ బీ/2 అపార్ట్‌మెంట్ వద్ద సంపునకు వీఎంసీ వాటర్ కనెక్షన్ ఇచ్చే పనులను 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ మంగళవారం పరిశీలించారు. వీఎంసీ సాధారణ నిధులు రూ.7లక్షలతో నిర్మించిన గ్రౌండు బావి(సంపు) వల్ల స్థానిక ప్రజలకు నీటిసరఫరా అందుబాటులోకి వస్తోందని కార్పొరేటర్ తెలిపారు. సంపునకు నగర పాలక సంస్థ నీటి సరఫరా కనెక్షన్ ఇవ్వడం వల్ల ఇక్కడ ప్రజలు నీటిని వినియోగించుకొనే అవకాశం ఏర్పడిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు కండ్రికలో ఐకాన్ సెంటర్లో సీసీ రోడ్డు నిర్మాణం, సీఎంఆర్ క్రాస్ వద్ద రెండు రోడ్లు, డబ్ల్యూఎంఎం రోడ్డు, రాజీవ్‌నగర్ కట్ట రోడ్డు నిర్మాణాలు కలిపి గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన రూ. 20లక్షలతో నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. సచివాలయ కన్వీనర్ దుగ్గిపోగు కిరణ్, వాటర్ సెక్షన్ మందా మధు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



వాటర్ సప్‌లై కనెక్షన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ

తూర్పు కాపులను ఓబీసీ జాబితాలో చేర్చాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తూర్పు కాపులను ఓబీసీ జాబితాలో చేర్చాలని తూర్పు కాపు విద్య, విజ్ఞాన అభివృద్ధి సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు కునుకు రాజశేఖర్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న తూర్పు కాపులందరికీ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏ విధమైన ఇబ్బంది కలగకుండా ఓబీసీ రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయన్నారు. ఆ మూడు జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు వలస వచ్చిన తూర్పు కాపులకు ఆ సౌకర్యం లేదన్నారు. దీంతో విద్యా, ఉద్యోగాల్లో తూర్పు కాపులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత 30 ఏళ్లుగా విజయవాడతోపాటు మిగిలిన నగరాలలోని తూర్పు కాపులు ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాలను కోరుతూనే ఉన్నామన్నారు. ఓబీసీ రిజర్వేషన్ల అమలు చేయాలని ఢిల్లీ వెళ్తున్నట్లు చెప్పారు. ఢిల్లీలో నేషనల్ కమిషన్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ చైర్మన్‌ను కలిసి తమ సమస్యలు వివరిస్తామన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తూర్పు కాపు సంఘం నాయకులు కునుకు రాజశేఖర్

విద్యార్థులకు కంటి పరీక్షలు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం మంగళవారం సత్యనారాయణపురంలోని ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పారా మెడికల్ ఆఫీసర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ రవిరాజ్ పాల్గొని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శరీరంలో అన్ని అవయవాల్లో కళ్లు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ఏకేటీపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 125 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. అందులో అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేయడంతో పాటు వారికొంత మందికి కళ్లజోళ్లు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోగ్రామ్ మేనేజర్ శిరీష, ఏఎన్ఎమ్‌లు, ఆశ వర్కర్‌లు, స్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

18 నుంచి 26 వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలు శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18వ తేదీన స్వామివారిని విశేషంగా పసుపు, 19న కుంకుమ, 20న గంధం, 21న సింధూరం, 22న గంధం, 23న విభూతి, 24న తమలపాకులు, 25న స్వామివారి నిజరూపదర్శనం 26న గరిక పూలుతో విజయ గణపతి స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు జరుగుతాయని, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

వీధి కుక్కల కోసం నిర్దిష్టమైన చట్టాలు

పటమట(విజయవాడతూర్పు): వీధి కుక్కల కోసం నిర్దిష్టమైన చట్టాలు ఉన్నాయని, వాటికి కూడా రాజ్యాంగ రక్షణ ఉందని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీధి కుక్కలపై అమానుషంగా వ్యవహరిస్తే ఇకపై చట్టపరమైన శిక్ష తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వం కుక్కల సంరక్షణకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, అందులో కుక్కలు, కుక్కలకు ఫీడింగ్ చేసే వారికి రక్షణ కల్పించాలని చెప్పిందన్నారు. వీధి కుక్కలకు ఆహారం పెట్టే వ్యక్తికి ఎవరైనా పరిమితులు విధించినా, నిషేధాలు విధించినా, అసౌకర్యానికి గురి చేసినా, బెదిరించినా దానిని శిక్షార్హమైన నేరంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కమ్యూనిటీ జంతువులు, పెంపుడు జంతువులపై స్థానభ్రంశం, అపహరణ, క్రూరత్వ చర్యలకు పాల్పడే వ్యక్తులకు ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని చెప్పారు. జంతువులపై నేరం జరిగినప్పుడు చర్య తీసుకునేందుకు పోలీసులకు ప్రత్యేక అధికారాలను ఇచ్చిందని, అన్ని జంతు హింసలు క్రిమినల్ నేరంగా పరిగణనలోకి వస్తాయన్నారు. యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) నిబంధనలకు అనుగుణంగా వీధి కుక్కల జనాభాను స్థిరీకరించడానికి/తగ్గించడానికి రేబిస్ ప్రమాదాన్ని తొలగించడానికి ఒక సాధనంగా స్టెరిలైజేషన్ టీకాల ప్రక్రియ అమలు చేస్తున్నామని తెలిపారు. చట్టం వీధి కుక్కల పునరావాసాన్ని నిషేధించిందని వాటిని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరిమివేయడం, చేస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. కుక్కలకు స్టెరిలైజ్ చేసి టీకాలు వేసి తిరిగి అదే ప్రాంతానికి పంపించాలని, టీకాలు వేసిన, స్టెరిలైజ్ చేసిన కుక్కలను గ్రామ పంచాయతీలు, నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు కూడా నిర్మూలించే వెసులుబాటు లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నగర వాసులు కుక్కల టీకాలు, యానిమల్ బర్త్ కంట్రోల్‌కు సహకరించాలని కమిషనర్

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: కవి, పండితుడు సినీ పాటల రచయిత ఆత్రేయ వర్ధంతి సందర్భంగా మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. పద్మశ్రీ ఘంటసాల చైతన్యవేదిక, శ్రీకళాభారతి, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఈ కార్యక్రమం జరిగింది. గాయనీ గాయకులు మల్లాది స్వాతి, వడ్డాది కామేశ్వరి, షబానా, రాజ్యలక్ష్మి, శ్యాంప్రసాద్ వెంకట్, శ్రీనివాసరావు, జగన్‌మోహనరావు, అబ్రహాం ఆత్రేయ రచించిన సినీ గీతాలను ఆలపించారు. సీనియర్ గాయకుడు డేవిడ్‌రాజు మాట్లాడుతూ తెలుగు సినిమాలలో సాహితీ విలువలను కాపాడుతూ ఆత్రేయ గీతాలను రచించారని తెలిపారు. సీహెచ్ చిట్టిబాబు మాట్లాడుతూ ఆత్రేయను మనసు కవిగా భావిస్తారని తెలిపారు. కార్యక్రమంలో శింగంశెట్టి చంద్రశేఖర్, చీదెళ్ల నాగేశ్వరరావు, గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

దళితుల హక్కులను కాపాడుకుందాం

కృష్ణలంక(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దళితుల హక్కులు–సామాజిక న్యాయం కోసం అందరం కలిసి కలసికట్టుగా పోరాడుదామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో కేవీపీఎస్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితుల హక్కులు–సామాజిక న్యాయం కోసం అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో నేటికీ దళితులపై దాడులు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సబ్ ప్లాన్ చట్టాన్ని రద్దు చేసిందని, రిజర్వేషన్లను అమలు చేయకుండా చూస్తోందన్నారు. లౌకిక రాజ్యాంగానికే ప్రమాదం పొంచి ఉందని, మన హక్కులను కాలరాస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చర్చావేదికలు, పాద, సైకిల్, బైక్, జీపు యాత్రలు నిర్వహించాలని, దళిత పేటల్లో సంతకాల సేకరణ చేయాలని, ఈ నెల 26న ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



హక్కుల సాధన కోసం ఐక్యత చాటుతున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు

'మట్టి గణపతిని పూజిద్దాం - పర్యావరణాన్ని కాపాడుకుందాం'

పటమట(విజయవాడతూర్పు): పర్యావరణ పరిరక్షణకు విత్తనాలతో కూడిన మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దామని విజయవాడ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నగర వాసులకు మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణకు నగర ప్రజలు సహకరించాలని విత్తనాలతో కూడిన మట్టి విగ్రహాల నిమజ్జనం అనంతరం మొక్కలు మొలుస్తాయని ఇది పర్యావరణ సహితమని పేర్కొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల కాలుష్యం పెరిగిపోయి మానవాళికి ప్రమాదంలోకి నెట్టబడుతుందని చెప్పారు. నగరంలో పీవోపీతో తయారు చేసిన వినాయక విగ్రహాలు ఉపయోగించకుండా స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, వివిధ ఆలయాల కమిటీ సభ్యులు, నగర ప్రజలు సహకరించాలని కోరారు. మట్టితో వినాయకుడి ప్రతిమను తయారుచేయడంపై విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఒక వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశామన్నారు. మట్టి విగ్రహాలు తయారు చేయాలనుకునే వారు సంబంధిత వీడియోను చూడాలని కోరారు.



వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

వీనులవిందుగా హరికథా మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: హరికథా పితామహుడు ఆదిభట్లనారాయదాసు 159వ జయంతి సందర్భంగా ఆయన శిష్యప్రశిష్యులు సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో నిర్వహిస్తున్న హరికథా మహోత్సవాలు భక్తిరస ప్రధానంగా సాగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన హరికథా భాగవతార్‌లు గురుభక్తిని చాటుకుంటున్నారు. మంగళవారం నాటి కార్యక్రమంలో కర్నూలుకు చెందిన పి. రవిప్రసాద్ భక్తమయూరధ్వజ, తిరుపతికి చెందిన షణ్ముఖి భాగవతారాణి మహిసాసుర మర్దని, పి. విజయకుమార భాగవతారిణి సుందరా కాండ, హైదరాబాద్‌కు చెందిన పడాల కల్యాణి వల్లీకల్యాణం కథను గానం చేశారు. కార్యక్రమంలో వాయిద్యకళాకారులు అమ్ముల ప్రసాద్, పాణ్యం దక్షిణామూర్తి, పాలపర్తి ఆంజనేయులు పాల్గొన్నారు. కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. బుధవారం నాటితో హరికథా ఉత్సవాలు ముగుస్తాయని కన్వీనర్ బుర్రా పద్మనాభ శాస్త్రి వివరించారు.



మహిసాసురమర్దని కథను గానం చేస్తున్న తిరుపతికి చెందిన షణ్ముఖభాగవతారిణి

లారీ చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కంకిపాడు(పెనమలూరు): లారీ చోరీ కేసులో నిందితుడిని కంకిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. విజయవాడ లబ్బీపేటలో నివాసం ఉంటున్న బొమ్మదేవర వెంకట సుబ్బారావు బీవీఎస్ కార్గో, మూవర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ వెంకట సుబ్బారావుకు చెందిన ట్యాంకర్ లారీని లారీ డ్రైవర్ సురేష్ ఈనెల 3వ తేదీ రాత్రి కంకిపాడు మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకు పక్కన రోడ్డు మార్జిన్‌లో పార్కు చేశాడు. 4వ తేదీ ఉదయం లారీ పార్కు చేసిన ప్రదేశానికి వెళ్లి చూడగా లారీ కనిపించలేదు. దీంతో డ్రైవర్ సురేష్ విషయాన్ని యజమాని వెంకట సుబ్బారావుకు సమాచారం అందించారు. వెంకట సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుతో లారీ చోరీ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంకిపాడు సీఐ వీ.శ్రీనివాసరావుకు అందిన సమాచారం మేరకు ఉప్పలూరు ఖాళీ ఫ్లాట్స్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న పామర్రు మండలం పసుమర్రుకు చెందిన నిడుమోలు పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అందించిన సమాచారంతో ట్యాంకర్ లారీని ఉప్పలూరులో గుర్తించి బాధితులకు అప్పగించారు. నిందితుడు పవన్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.